

సోమశిలలో 8.68 టీఎంసీలు
సోమశిల: సోమశిల జలాశయంలో శనివారం సాయంత్రానికి 8.68 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 670 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.74,420
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,647
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,846
నవర (8 గ్రాములు)	రూ.54,768



క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాలి
చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను ముమ్మరంగా చేపట్టాలని కలెక్టర్ హరినారాయణన్ సూచించారు. వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద చెక్‌పోస్టును శనివారం ఆయన పరిశీలించారు. 8లో

న్యూస్‌రీల్

ఓటు హక్కును వినియోగించుకోండి
- ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్



ఈవీఎంల గోదామును పరిశీలిస్తున్న హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): వచ్చే నెల 13న నిర్వహించనున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ పిలుపునిచ్చారు. నెల్లూరు ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎంల గోదామును శనివారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 18న ప్రారంభం కానుందని చెప్పారు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు అవసరమైన ఈవీఎంల ర్యాండమైజేషన్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించామని తెలిపారు. నియోజకవర్గ కేంద్రాల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలను భద్రపర్చనున్నామని వెల్లడించారు.

రెండు దశల్లో ఇంటర్ అడ్మిషన్లు
నెల్లూరు(అర్బన్): ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు, అడ్మిషన్ల ప్రక్రియకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వ ఆదేశాల మేరకు విడుదల చేశామని ఆర్‌ఐఓ ఆదూరు శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ల ప్రక్రియను రెండు దశల్లో నిర్వహించనున్నామని చెప్పారు.
- మొదటి దశలో మే 15 నుంచి దరఖాస్తులను పొందాలని.. 22 నాటికి అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయనున్నామని చెప్పారు. జూన్ ఒకటి నుంచి తరగతులను ప్రారంభించనున్నామని వివరించారు.
- రెండో దశకు సంబంధించి జూన్ పదిన అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించి.. జూలై ఒకటి నాటికి పూర్తి చేయనున్నామని తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, రెసిడెంట్ కళాశాలల యాజమాన్యాలు షెడ్యూల్ మేరకు అడ్మిషన్లను పూర్తి చేయాలని కోరారు.

సీఎంపై దాడి హేయం



మాట్లాడుతున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి

సంగం: మేమంతా సిద్ధం బస్సు యాత్రలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి చేయడాన్ని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. పడమటిపాళెంలో విలేకరులతో శనివారం రాత్రి ఆయన మాట్లాడారు. సీఎంపై దాడి హేయమైన చర్యగా అభివర్ణించారు. దీనిపై ఎన్నికల సంఘం చర్యలు చేపట్టాలని కోరారు. సీఎంకు ప్రజల్లో లభిస్తున్న అభిమానాన్ని ఓర్వలేక ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. సంగం మండల మాజీ కన్వీనర్ కంటాబత్తిన రఘునాథరెడ్డి, కోలగట్ల మాజీ సర్పంచ్ ఏటూరు సుధాకర్‌రెడ్డి, డాక్టర్ ప్రణీత్, సర్పంచ్ మానికల చందన్‌కుమార్ పాల్గొన్నారు.
- ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా పాల్గొంటున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై విజయవాడలో జరిగిన దాడి దారుణమని మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. క్యాట్ బాల్‌తో సీఎంపై దాడి చేయడాన్ని హేయమైన చర్యగా అభివర్ణించారు. దైవబలంతోనే ఆయనకు అపాయం తప్పిందని చెప్పారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.


పొత్తుతో గ్లాసు చిత్తు

అది చేస్తాం.. ఇది చేస్తాం అంటూ ఉద్వేగ పూరిత ప్రసంగాలతో ఊదరగొట్టే పవన్ కల్యాణ్ తన జనసేన పార్టీని జిల్లాలో టీడీపీ పాదాల చెంత తాకట్టు పెట్టారు. నెల్లూరులో తాను పుట్టి పెరిగానని పదే పదే చెప్పుకొన్న ఆయన చివరికి జిల్లాలో ఆ పార్టీ ఉనికే లేకుండా చేశారు. జిల్లాలో జనసేన జెండానే లేకుండా చేయాలనే తన అజెండాను అమలు చేయడంలో టీడీపీ సఫలీకృతమైంది. ఆ పార్టీని ఎంతో కాలంగా నమ్ముకొని.. పొత్తులో భాగంగా జిల్లాలో ఏదో ఒక స్థానంలో తమకు పోటీ చేసే అవకాశం లభిస్తుందనే ఆశతో ఉన్న నేతలకు ఈ పరిణామాలు మింగుడుపడటంలేదు. ఈ తరుణంలో ఎవరి దారి వారు చూసుకుంటూ గాజు గ్లాసును ఎత్తి పడేస్తున్నారు.

జనసేనను నిర్వీర్యం చేయడంలో టీడీపీ సక్సెస్
- పక్కా వ్యూహంతో కుట్ర అమలు
- కోవర్టులతో అలజడి రాజేసిన వైనం
- దూరమవుతున్న కీలక నేతలు
- మొన్న కేతంరెడ్డి.. నేడో..రేపో మనుక్రాంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నామమాత్రపు బలం.. ఆపై టీడీపీ అనుసరిస్తున్న అజెండాతో జిల్లాలో జనసేన కకావికలమవుతోంది. పొత్తులో భాగంగా జనసేన బలోపేతమవ్వడమనే మాట అటుంచితే.. మరింత కుదేలైంది. జిల్లాలో టీడీపీకి తన జనసేన పార్టీని పవన్ కల్యాణ్ తాకట్టు పెట్టి నామరూపాల్లేకుండా చేశారు.

పొమ్మనకుండా.. పొగబెట్టారు..!
జిల్లాలో జనసేన జెండానే లేకుండా చేయాలనే సంకల్పంతో టీడీపీ వ్యూహాత్మకంగా పావులు కదిపి దాన్ని అమలు చేయడంలో సక్సెస్ అయింది. తన అజెండా మేరకు జనసేనలో ఉన్న బలమైన సామాజికవర్గాన్ని పొమ్మనకుండా పొగబెట్టి.. ఆ పార్టీ అడ్రస్ లేకుండా టీడీపీ చేసింది.



ఊహలు తలకిందులు
గత ఎన్నికల్లో ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పది నియోజకవర్గాల్లో పోటీ చేసిన జనసేనకు ఆరు శాతం ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో పార్టీ గ్రాఫ్‌ను పెంచాలనే ఉద్దేశంతో పలువురు నేతలు అహర్నిశలూ కష్టపడ్డారు. తమకు రాజకీయ భవిష్యత్తు ఉంటుందనే భావనతో అప్పులు చేసి మరీ పార్టీ కార్యకలాపాలను సాగించారు. పైగా జనసేన కోసం కష్టపడే వారికి తగిన ప్రాధాన్యం ఉంటుందనే పవన్ కల్యాణ్ ప్రకటనతో ఆ పార్టీ నేతల్లో ఆశలు చిగురించాయి. టీడీపీతో పొత్తు తరుణంలో సీట్లు దక్కుతాయని.. ఎక్కడో ఓ చోట తాము పోటీ చేయొచ్చనే ధీమాతో ఉన్న జనసేన నేతల అంచనాలు తలకిందులయ్యాయి.

కోవర్టు ద్వారా విభేదాలు రాజేసి..
జనసేనలో ఉన్న ఓ సామాజికవర్గ నేతలను టీడీపీ టార్గెట్ చేసి వారిని దూరం చేసింది. రానున్న రోజుల్లో జనసేన జెండా కనిపించకూడదనే దిశగా అడుగులు పడుతున్నాయి. తొలుత టీడీపీ నేత నారాయణ తన శిబిరం నుంచి ఓ కోవర్టును జనసేనలోకి పంపి.. సదరు నేత ద్వారా పార్టీలో విభేదాలను సృష్టించారు. అప్పటి వరకు పార్టీ జెండాను మోసి.. కష్టపడి పనిచేస్తున్న నేతలను టార్గెట్ చేసి వారిని ఘోరంగా అవమానించి.. బయటకు పంపేలా చేశారు. ప్రస్తుతం టీడీపీ కోవర్టులనే జనసేన నేతలుగా చెప్పిస్తున్నారు. మరోవైపు కావలిలో జనసేన నేతలు పసుపు కండువా కప్పుకోవాల్సిందేనని టీడీపీ అభ్యర్థి బహిరంగంగానే బెదిరించారు.

ప్రచారానికి దూరం
జిల్లాలో టీడీపీ తరఫున పోటీ చేసే అభ్యర్థులందరూ జనసేన కేడర్‌ను అవమానించే రీతిలో వ్యవహరిస్తున్నారు. కొందరు కనీసం పిలిచి మాట్లాడకపోగా.. మరికొందరు బెదిరిస్తున్నారనే బాధ ఆ పార్టీ నేతల్లో ఉంది. అవమానాలను తట్టుకోలేక నేతలు చివరికి సైడ్ అయిపోయారు. ప్రజలకు మేలు చేసే పార్టీకే ఓట్లేస్తామని జనసేన కేడర్‌తో పాటు పవన్ కల్యాణ్ అభిమానులు చెప్తున్నారు.

ఒక్కొక్కరుగా గుడ్ బై
ప్రజా ప్రయోజనాల కోసం కాకుండా చంద్రబాబును అధికార పీఠంపై కూర్చోబెట్టడమే లక్ష్యంగా జనసేనాని పనిచేస్తున్నారనే అంశాన్ని ఆ పార్టీ కేడర్ కొంత ఆలస్యంగా గ్రహించింది. చివరికి పార్టీ కార్యకలాపాలకు ఒక్కొక్కరుగా దూరమయ్యారు.
- గత ఎన్నికల్లో నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో జనసేన అభ్యర్థులుగా కేతంరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, మనుక్రాంత్‌రెడ్డి పోటీ చేశారు. ఓటమిపాలైనా పార్టీనే నమ్ముకొని భారీగా ఖర్చు పెట్టి కేడర్‌ను కాపాడుకుంటూ వచ్చారు. టీడీపీతో పొత్తు తరుణంలో, ఈ దఫా త్యాగాలకు పార్టీ కేడర్ సిద్ధం కావాలని పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఈ క్రమంలో తన సీటుకు ఎసరు తప్పదనే ఉద్దేశంతో పార్టీకి కేతంరెడ్డి ముందే గుడ్ బై చెప్పారు.
- నెల్లూరు సిటీ పరిధిలో డివిజన్ల వారీగా పార్టీ కార్యాలయాలను పార్టీ జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్‌రెడ్డి తెరిచి కార్యకలాపాలను విస్తృతం చేశారు. అయితే తాను నెల్లూరు సిటీ నుంచి పోటీ చేస్తున్నానని మాజీ మంత్రి నారాయణ ప్రకటించడంతో కంగుతిన్న మనుక్రాంత్‌రెడ్డి కనీసం రూరల్ సీటైనా వస్తుందని ఆశించారు. అయితే అక్కడా ఆయనకు శృంగభంగమే ఎదురైంది. వరుస భంగపాట్లతో జనసేనను వీడేందుకు ఈయన సిద్ధమయ్యారు.

కాంగ్రెస్‌కు అల్లావుద్దీన్ రాజీనామా



ఆదాలను కలిసిన అల్లావుద్దీన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగ జిల్లా అధ్యక్షుడు అల్లావుద్దీన్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. వెంకటేశ్వరపురంలో తన అనుచరులతో కలిసి విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. నెల్లూరు రూరల్ అభ్యర్థిగా తానొక్కడ్నే దరఖాస్తు చేసుకున్నానని, అయితే తనను కాదని ఇతరులకు కేటాయించారని చెప్పారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలను కొప్పుల రాజుకు తెలియజేసేందుకు ఇందిరాభవన్‌కు శుక్రవారం వెళ్లిన తనపై దాడికి యత్నించారని ఆరోపించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై పార్టీకి రాజీనామా చేస్తున్నానని తెలిపారు. తన అనుచరులతో కలిసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో త్వరలో చేరనున్నానని వెల్లడించారు. ఈ మేరకు ఆ పార్టీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డితో చర్చించానన్నారు.

డీసీపల్లిలో 715 బేళ్ల విక్రయం
మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో 715 బేళ్లను శనివారం విక్రయించారని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 757 బేళ్లు రాగా, వీటిలో 715 విక్రయం కాగా, మిగిలిన వాటిని తిరస్కరించామని చెప్పారు. 89,355 కిలోల పొగాకును విక్రయించగా, రూ.2,03,96,288 వ్యాపారం జరిగిందన్నారు. గరిష్ట ధర కిలో ఒక్కింటికి రూ.245.. కనిష్ట ధర రూ.220.. సగటు ధర రూ.228.65గా నమోదైందని తెలిపారు. వేలానికి 16 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారన్నారు.

కందుకూరు సమగ్రాభివృద్ధే ధ్యేయం



మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి, పక్కన బుర్రా మధుసూదన్‌యాదవ్, జూపూడి ప్రభాకర్‌రావు

- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు
- పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి

కందుకూరు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానంతరం ఐదేళ్ల పాలనలో నెల్లూరు లోక్‌సభ పరిధిలోని ప్రాంతాలతో పాటు కందుకూరు నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని పార్టీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. కందుకూరులోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కందుకూరు, ఉలవపాడు, వలేటివారిపాళెం, లింగసముద్రం మండలాల్లో మూడు రోజుల పాటు విస్తృత ప్రచారం చేశానని, గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందని చెప్పారు. ప్రజల స్పందన బట్టి 175కు 175 ఎమ్మెల్యే సీట్లు, 25 ఎంపీ సీట్లను గెలుస్తామని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. కందుకూరు నియోజకవర్గంలో వరుసగా మూడోసారి విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్ని విధాలా తమకు సహాయ సహకారాలను అందిస్తున్నారని, ఆయన సూచనలకు అనుగుణంగా ఎన్నికల్లో పనిచేస్తున్నామని వివరించారు.

ఆర్నెల్లకోసారి ప్రజాదర్బార్
నెల్లూరు ఎంపీగా తాను, కందుకూరు ఎమ్మెల్యేగా బుర్రా మధుసూదన్ యాదవ్ గెలుపొందాక ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాదర్బార్‌ను ఆర్నెల్లకోసారి నిర్వహిస్తామని విజయసాయిరెడ్డి తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యనూ క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు. జాబ్‌మేళాలను సైతం ఆర్నెల్లకోసారి నిర్వహించి కార్పొరేట్ కంపెనీల ద్వారా యువతకు ఉద్యోగాలు కల్పించేలా కృషి చేస్తామని వెల్లడించారు.

అబద్ధాల కోరు చంద్రబాబు
ప్రజలను మోసం చేయడమే లక్ష్యంగా చంద్రబాబు నిరంతరం అబద్ధాలు చెప్తున్నారని విమర్శించారు. వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు ఆయన యత్నించారని ఆరోపించారు. ఆయన చెప్పే అబద్ధాలను బీజేపీ, జనసేన నేతలు సైతం నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. వలంటీర్లతో పాటు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన 87 శాతం కుటుంబాలు చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తారని స్పష్టం చేశారు.

టీడీపీ గెలిస్తే అలజడులు
కందుకూరులో టీడీపీ గెలిస్తే ప్రశాంతతను చెడగొడతారని.. నిత్యం అల్లర్లు సృష్టించడమే పనిగా పెట్టుకుంటారని పార్టీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ పేర్కొన్నారు. కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపే విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. 2026లో డీలిమిటేషన్ అనంతరం పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలు పెరిగే అవకాశం ఉందని, ఆ విధంగా చూసినా తిరిగి ప్రకాశం జిల్లాలో కందుకూరు కలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బీసీ అభ్యర్థిని గెలిపించండి
కందుకూరులో మొదటిసారి బీసీ వర్గానికి చెందిన అభ్యర్థి మధుసూదన్ యాదవ్ పోటీ చేస్తున్నారని, ఆయన్ను గెలిపించాలని ప్రభుత్వ సలహాదారుడు జూపూడి ప్రభాకర్‌రావు కోరారు. రిటైర్డ్ ఐఏఎస్‌ల ద్వారా వలంటీర్ వ్యవస్థను అడ్డుకునేందుకు చంద్రబాబు కుట్ర చేశారని ఆరోపించారు.

ఐదేళ్లలో మరింత అభివృద్ధి
- కందుకూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను వచ్చే ఐదేళ్లలో పూర్తి చేస్తామని విజయసాయిరెడ్డి హామీ ఇచ్చారు.
- రామాయపట్నం పోర్టు నిర్మాణాన్ని పూర్తి చేశామని.. పోర్టు అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఇక్కడ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన స్థానికులకే ఉద్యోగాలిచ్చేలా కృషి చేస్తానని చెప్పారు.
- ఉలవపాడు మామిడి రైతుల కోసం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను కేంద్ర నిధులతో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు.
- రూ.70 కోట్లతో కందుకూరు ఉత్తర బైపాస్ రోడ్డు నిర్మాణం, రూ.50 కోట్లతో రాళ్లపాడు ఎడమకాలువ పొడిగింపు, కందుకూరు – తెట్టు మధ్య మన్నేరుపై రూ.18 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి, వీవీపాళెం నుంచి రాళ్లపాడు ప్రాజెక్ట్ వరకు ఉన్న రోడ్డును రూ.20 కోట్లతో రెండు వరుసలుగా మార్చేందుకు చర్యలు చేపడతామన్నారు.
- కందుకూరు, నర్సింగోలు మధ్యలో పాలేరుపై రూ.25 కోట్లతో బ్రిడ్జి, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, రూ.ఐదు కోట్లతో పోకూరు చెరువు అభివృద్ధి వంటి పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

సంక్షేమ పథకాలతో సోమరులవుతారంట..!
- టీడీపీ కోవూరు అభ్యర్థి ప్రశాంతిరెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు
- భగ్గుమంటున్న ప్రజలు

ఇందుకూరుపేట: పేదలకు సంక్షేమ పథకాలను అందించి వారిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సోమరిపోతులను చేస్తున్నారంటూ టీడీపీ కోవూరు అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుచ్చిరెడ్డిపాళెంలో శనివారం పర్యటించిన ఆమె ఈ కొత్త పలుకులు పలికి ప్రజాగ్రహానికి గురయ్యారు.

తీవ్ర దుమారం రేపిన వ్యాఖ్యలు
నవరత్నాల పేరుతో సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఆమె విమర్శలు చేశారు. డబ్బులివ్వడం ద్వారా వారిని సోమరిపోతులుగా తయారు చేశారని, ఇప్పుడు వారు ఎలాంటి పనులు చేయాలన్నా ఇబ్బందులు పడుతున్నారంటూ చులకనగా మాట్లాడారు. డబ్బులు తీసుకుంటే భవిష్యత్తులో రోడ్లు.. కాలువలు ఉండవు.. అంటూ ఆమె చేసిన ప్రసంగం తీవ్ర దుమారాన్ని రేపుతోంది.

అందరూ మీలా ధనవంతులు కారమ్మా..!



ఎన్నికల ప్రచారంలో ప్రసన్నకుమార్‌రెడ్డి

వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలపై కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ఇందుకూరుపేట మండలంలోని కుడితిపాళెంలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదల జీవన ప్రమాణాలు పెరిగాయని తెలిపారు. ప్రజాబలం.. ధనబలం మధ్య ఈ ఎన్నికల సమరం జరుగుతోందని చెప్పారు. ధనవంతులు బాబు పక్కన.. పేదలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పక్షాన ఉన్నారని పేర్కొన్నారు. మీ మాదిరిగా ధనవంతులు ఉండరని.. రెక్కాడితే గానీ డొక్కాడని పేదల స్థితిగతులను మెరుగుపర్చేందుకు వినూత్న పథకాలను సీఎం అమలు చేస్తున్నారని తెలిపారు. ఎప్పుడో ఓసారి ప్రజల్లోకి వచ్చే ఇలాంటి వారికి పేదల కష్టాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. మీ వద్దకొచ్చి సమస్యలు తెలియజేయడం ప్రజలకు సాధ్యమేనానన్నారు. వీరి మోసాలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజు దగ్గర్లోనే ఉందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను.. ఎంపీగా విజయసాయిరెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం నల్లపరెడ్డి రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడారు. 150 వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశామని వారు చెప్పుకొంటున్నారని.. తెలుగుగంగను తీసుకొచ్చి సాగు, తాగునీటిని అందించిన ఘనత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డికే దక్కుతుందని చెప్పారు. ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, ఏపీఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, బట్టేపాటి నరేంద్రరెడ్డి, ఎస్కేటీ బాషా, మెట్టా వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నాగభూషణం, సాబ్జాన్, సర్పంచ్ నాయుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మెరైన్ పోలీసుల సమయస్ఫూర్తి
- కోడూరు బీచ్‌లో మునిగి అపస్మారక స్థితిలోకి యువకుడు
- సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడిన వైనం



యువకుడ్ని ఒడ్డుకు చేరుస్తున్న మెరైన్ పోలీసులు

తోటపల్లిగూడూరు: మండలంలోని కోడూరు బీచ్‌లో మునిగి ప్రాణాపాయ స్థితిలో ఉన్న యువకుడి ప్రాణాలను మెరైన్ పోలీసులు కాపాడారు. వివరాలు.. సైదాపురం మండలం తూర్పుపూండ్లకు చెందిన కొందరు యువకులు కోడూరు బీచ్ సందర్శనకు శుక్రవారం సాయంత్రం వచ్చారు. వీరందరూ సముద్రంలో మునుగుతూ సందడి చేయసాగారు. ఈ తరుణంలో హుస్సేన్‌బాషా మునిగి అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. ఓ దశలో ఆయన మరణించి ఉంటారని భావించిన స్నేహితులు ఆందోళన చెందారు. ఈ క్రమంలో హుస్సేన్‌బాషాకు అక్కడే ఉన్న మెరైన్ పోలీస్ పోలయ్య సీపీఆర్ చేసి శ్వాస తిరిగి తెప్పించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం నెల్లూరు తరలించారు. ప్రస్తుతం యువకుడి ఆరోగ్యం నిలకడగా ఉంది.

కొనసాగుతున్న తనిఖీలు
నెల్లూరు(క్రైమ్): నగదు, మద్యం అక్రమ రవాణాను అడ్డుకోవడమే లక్ష్యంగా తనిఖీలను పోలీస్ అధికారులు ముమ్మరం చేశారు. చిన్నబజార్, వేదాయపాళెం పరిధిలో రూ.ఐదు లక్షల చొప్పున, మనుబోలులో రూ.1,13,800, ముత్తుకూరులో రూ.52 వేలు, కృష్ణపట్నం పోర్టు పరిధిలో రూ.1.04 లక్షలను ఎలాంటి పత్రాల్లేకుండా తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మర్రిపాడు, ముత్తుకూరులో పది చొప్పున, వరికుంటపాడులో 20, కావలి రూరల్‌లో 19, ఉలవపాడులో 28.. ఎస్‌ఈబీ ఆధ్వర్యంలో 91 మొత్తంగా 178 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని నిందితులపై కేసులు నమోదు చేశారు.

క్లుప్తంగా

పోలింగ్‌లో పీఓ, ఏపీఓలది కీలకపాత్ర

• కలెక్టర్ హరినారాయణన్



శిక్షణను పరిశీలించి సూచనలు చేస్తున్న కలెక్టర్

వెంకటాచలం: పోలింగ్ నిర్వహణలో పీఓ, ఏపీఓలది కీలకపాత్ర అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. వెంకటాచలంలోని క్యూబా ఇంజినీరింగ్ కళాశాలలో పీఓ, ఏపీఓలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని శనివారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులకు సంబంధించి ఇస్తున్న శిక్షణ తరగతులను పీఓ, ఏపీఓలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏమైనా సందేహాలుంటే వెంటనే అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియను నిర్వహించేందుకు శిక్షణ తరగతులు ఎంతగానే తోడ్పడుతాయన్నారు.

తనిఖీలు ముమ్మరం చేయండి

ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను ముమ్మరం చేయాలని కలెక్టర్ హరినారాయణన్ సూచించారు. వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీని కలెక్టర్ పరిశీలించారు. రాత్రి వేళల్లోనూ తనిఖీలను చేపట్టాలని, ముఖ్యంగా ట్రాన్స్‌పోర్టు వాహనాలు, లారీలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. ఎటువంటి అనుమతులు లేకుండా రవాణా చేసే పార్శిల్ లారీలను సీజ్ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట సర్వేపల్లి ఆర్వో చినఓబులేసు, డీఎస్పీ వీరాంజనేయరెడ్డి తదితరులు ఉన్నారు.

జగనన్న ప్రభుత్వానికే ప్రజామద్దతు



కోటమిట్టలో ప్రచారం చేస్తున్న ఎన్ఆర్ఐ షేక్ ఇంతియాజ్

నెల్లూరు(బారకాసు): లంచాలు, వివక్షకు తావులేకుండా విప్లవాత్మక మార్పులు, సంస్కరణలతో పేదల ఆకాంక్షకు అనుగుణంగా గొప్పపాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రజలు కోరుకుంటున్నారని ఎన్ఆర్ఐ షేక్ ఇంతియాజ్ పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచేందుకు దుబాయ్ నుంచి తన జన్మస్థలమైన నెల్లూరుకు విచ్చేసిన ఇంతియాజ్ నగరంలోని ఖుద్దూస్‌నగర్, కోటమిట్ట తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంచుతూ ఎన్నికల ప్రచారాన్ని శనివారం నిర్వహించారు. నెల్లూరు సిటీ ఎమ్మెల్యే, నెల్లూరు ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న ఖలీల్‌అహ్మద్, విజయసాయిరెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలన్నీ నెరవేర్చారని గుర్తుచేశారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న జగనన్నకు మద్దతుగా తాను మరికొన్ని రోజుల పాటు ప్రచారం చేస్తానని తెలిపారు. కార్పొరేటర్ షేక్ కరిముల్లా, మైనార్టీ నేతలు, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



చవటపాళెంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండలంలోని చవటపాళెం, పాలిచెర్లపాడు, కందలపాడు, పులతీగలపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో జతకట్టి మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఐదేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. రైతులు, పొదుపు మహిళలకు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి మోసం చేశారని గుర్తుచేశారు. చంద్రబాబు మోసాలను తెలుసుకున్న ప్రజలు 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలను 99 శాతం నెరవేర్చి సీఎం వైఎస్ జగన్ ప్రజల మన్ననలను పొందారని కొనియాడారు. వృద్ధులు, దివ్యాంగులకు వలంటీర్లు ఇంటి వద్దే పింఛన్ నగదు అందజేస్తుంటే చంద్రబాబు ఓర్వలేక ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో వారు అష్టకష్టాలు పడాల్సి వచ్చిందన్నారు. మతతత్వ పార్టీ బీజేపీతో పెత్తుపెట్టుకున్న చంద్రబాబుకు ఓటేసేందుకు ప్రజలు సుముఖంగా లేరన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా చేపట్టిన సీఎం వైఎస్ జగన్ వైపు మొగ్గు చూపేందుకు వారు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు ఎన్ని కుట్రలు పన్నినా అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, వైస్ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, నాయకులు కొణిదెన విజయభాస్కర్‌నాయుడు, రాచాల రవికుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మధరలు పొదలకూరు (కిలో)

పెద్దవి	: రూ.70
సన్నవి	: రూ.55
పండ్లు	: రూ.24



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 157
లేయర్ (లైవ్)	: 98
బ్రాయిలర్ చికెన్	: 274
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 304
లేయర్ చికెన్	: 167



మోసపూరిత హామీలను నమ్మొద్దు



గొల్లకందుకూరులో రోడ్‌షోలో మాట్లాడుతున్న ఆదాల

• వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల

నెల్లూరు సిటీ: ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలను నమ్మి మోసపోకుండా, ప్రజల పక్షాన నిలబడే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని గొల్లకందుకూరులో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల మాట్లాడుతూ తనను ఆశీర్వదిస్తే రూరల్ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. రానున్న ఐదేళ్లలో రూ.1500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి రూరల్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపుతామని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని ఫ్యాన్‌గుర్తుపై ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ స్రవంతి, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆనం విజయకుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, సుధీర్‌కుమార్‌రెడ్డి, మల్లు సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ బెల్లంకొండ దొరసానమ్మ, ఎంపీటీసీ సభ్యులు గునపాటి సుధాకర్‌రెడ్డి, స్థానిక నాయకులు పెంచలనారాయణ, బాబురావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి ప్రజలే బలం



బిట్రగుంట: బోగోలులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

• కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: వైఎస్సార్‌సీపీ బలం ప్రజలేనని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన బోగోలు మేజర్ పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బోగోలు, చెంచులక్ష్మీపురం, అక్కరాజువారికండ్రిగ, తదితర ప్రాంతాల్లో పర్యటించి మే 13న జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామిరెడ్డి మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన ప్రతిఒక్కరూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించుకునేందుకు సైనికుల్లా పనిచేస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో కావలి నియోజకవర్గంలో ప్రగతి పరుగులు తీయనుందన్నారు. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్లతో పాటు అనుబంధ పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెద్దఎత్తున లభించనున్నాయన్నారు. నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి త్వరలో బిట్రగుంటలో పర్యటించనున్నారని, ఆయనకు కేంద్ర ప్రభుత్వ విభాగాలతో సత్సంబంధాలు ఉన్నందున బిట్రగుంట రైల్వే ప్రగతికి ఆస్కారం ఉందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కావలి ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

భారీగా పార్టీలో చేరికలు

బోగోలు మేజర్ పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు ఆధ్వర్యంలో బోగోలు, అరవపాళెం, తదితర ప్రాంతాలకు చెందిన వారు ఎమ్మెల్యే రామిరెడ్డిని కలిసి మద్దతు తెలిపారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ మేకల సుజాత, జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, బోగోలు సర్పంచ్ పందిపాటి అనిత, ఎంపీటీసీలు కౌసల్య, వార్డు సభ్యులు సూరపనేని శ్రీనివాసులు, గంగపట్ల సనమ్మ, పద్మావతి, కుందుర్తి వేణు, మద్దిబోయిన పద్మ, ఆర్కే, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు పట్టం కట్టండి

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



ప్రజలతో మమేకమవుతున్న ఎమ్మెల్యే మేకపాటి

సంగం: రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు పట్టం కట్టాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన మండలంలోని గాంధీజనసంఘంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సంక్షేమాభివృద్ధే ధ్యేయంగా పాలన సాగించడంతో రాష్ట్రం పలు విభాగాల్లో మొదటి పది స్థానాల్లో నిలిచిందన్నారు. గాంధీజనసంఘం పంచాయతీలో 1427 మందికి రూ.6.26 కోట్లను డీబీటీ, నాన్‌డీబీటీ రూపంలో లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా రూ.20 లక్షలతో మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. మరోసారి తనను ఆశీర్వదిస్తే మిగిలిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. జగనన్న విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో అనేక సంస్కరణలు తీసుకొచ్చారని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి రానున్న ఎన్నికల్లో మరోదఫా వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. అనంతరం కొరిమెర్ల, పడమటిపాళెం గ్రామాలకు చెందిన నాయకులతో సమావేశమయ్యారు. తొలుత ఎమ్మెల్యేకు గాంధీజనసంగం సర్పంచ్ మానికల చందన్‌కుమార్, తెలమేకల శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ కంటాబత్తిన రఘునాథరెడ్డి, జెడ్పీటీసీ రావుల ప్రసాద్‌గౌడ్, వైస్‌ఎంపీపీ తలపల ఇందిరమ్మ, సంగం, దువ్వూరు సొసైటీల అధ్యక్షులు పీ శివకుమార్‌రెడ్డి, ఎస్ మదన్‌మోహన్‌రెడ్డి, నాయకులు గుండాల బాలచంద్రారెడ్డి, ఫణి, ప్రసాద్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, నరేష్, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.